# పిచ్చి ప్రేమ



CHANDRA

## కనకమేడల

శ్రీ భ్రమరాంబా మల్లికార్జునుల ఆలయంలో గణగణ గంటలు మోగాయి. పూజారి చలమయ్య హారతి పళ్ళెం పుచ్చుకుని గర్భాలయంలోంచి బయటకు వచ్చాడు. అక్కడున్నవాళ్ళంతా హారతి అందుకున్నారు. విబూది అందుకుని నొసట పెట్టుకున్నారు. చలమయ్య అందరికీ శఠగోపం పెట్టి లోపలికి వెళ్ళి పోయాడు.

కాసేపట్లో కొబ్బరిముక్కల ప్రసాదంతో తిరిగివచ్చాడు చలమయ్య. అక్కడ గుమిగూడిన పిల్లలకీ పెద్దలకీ అందరికీ ప్రసాదం పంచిఇచ్చి ఆయన వెనుదిరగబోయేంతలో "చలమయ్య మావో, ఆగాగు" అన్న కేకవినిపించింది.

చలమయ్య నవ్వుతూ "నువ్వా రాలేదేవిటా అనుకుంటున్నా పిచ్చి పూర్ణమ్మా!" అన్నాడు.

"నేను రాకెక్కడికి పోతాను చలమయ్య మావా!" అంటూ రెండు చేతులతో దోసిలిపట్టి దగ్గరగా వచ్చింది పిచ్చి పూర్ణమ్మ.

"ఉండుండు. నన్ను ముట్టుకోకు," అంటూ వెనక్కి జరిగి ఆమె దోసిట్లోకి ప్రసాదం జారవిడిచాడు చలమయ్య.

"నిన్నెందుకు ముట్టుకుంటాలే పూజారయ్యా! నేను ముట్టుకోవాల్సినోడు నన్ను తన్ని తగిలేశాడుగా," అని సాగదీస్తూ వెనక్కి తిరిగి గబగబా వెళ్లిపోయింది పూర్ణమ్మ, పిచ్చి పూర్ణమ్మ!

పూర్ణమ్మ నిజానికి పిచ్చిది కాదు. ఆమె మాటలు చేష్టలు అన్నీ సరిగ్గానే వుంటాయి. అయినా 'పిచ్చి' అనేది ఆ ఊరివాళ్ళు అనుగ్రహించి ఆమెకిచ్చిన బిరుదు.

పూర్ణమ్మ సంపన్న కుటుంబంలో పుట్టింది. పెళ్లీడుకు రాగానే ఆమెను పెళ్లిచేసుకోడానికి ఎందరో ప్రయత్నించి విఫలులయ్యారు. అందుకు కారణం పూర్ణమ్మ తమ దగ్గరే పనిచేస్తున్న రామయ్య అనే వ్యక్తిని మనసులో నిలుపుకోడం. కండపుష్టి కలిగి అంగబలం ఉన్న ఆరడుగుల మనిషి రామయ్య ఆమె నాకర్షించడంలో ఆశ్చర్య మేమీ లేదు.

సలక్షణంగా పూర్ణమ్మ రామయ్యల వివాహం జరిగిపోయింది. వాళ్ళు వేరే కాపురం కూడా పెట్టారుకూడా. కాని, ఆర్నెల్లు తిరక్కముందే వాళ్ల సంసారంలో ముసలం బయలుదేరింది. గతంలో పూర్ణమ్మకోసం ప్రయత్నించి విఫలులైన వాళ్లలో కొందరు రామయ్యను చేరదీశారు. అప్పుల్లా ప్రవర్తిస్తూ పూర్ణమ్మమీద లేనిపోనివన్నీ నూరిపోశారు.

నిర్మలంగా ఉన్న రామయ్య మనసులో నిప్పు చెలరేగింది. అగ్గిలాంటి మనిషైనా అందరితో కలుపుగోలుగా మాట్లాడే పూర్ణమ్మ స్వభావం అతని అనుమానాన్ని పెంచింది. ఫలితంగా రామయ్యకు పూర్ణమ్మమీద ఏహ్యభావం కలిగింది. అతనామెకు దూరంగా ఉండడం ప్రారంభించాడు. క్రమంగా రమణమ్మ అనే మరో స్త్రీతో సంబంధం ఏర్పరచుకున్నాడు.

జరుగుతున్న సంఘటనలకు కారణాల్ని ఊహించుకోలేకపోయింది అమాయకురాలైన పూర్ణమ్మ. రామయ్యకు పూర్వంనించి రమణమ్మతో సంబంధం ఉండేదేమో ననుకుంది. ముసుగులో గుద్దులాట లెందుకని తన భర్త అభీష్టాన్ననుసరించి రమణమ్మను తన యింటికే తీసుకొచ్చింది పూర్ణమ్మ. అతని సుఖాన్ని ఆశించి, తన సమ్మతిని తెలియచేసి రమణమ్మని రామయ్యకి రెండో భార్యగా కూడా చేసింది.

అప్పట్నించే అసలు చిక్కులన్నీ ప్రారంభమయ్యాయి. ఆ యింట్లో

అధికార స్థానాన్ని పొందిన రమణమ్మ పూర్ణమ్మకు ఆ యింట్లో స్థానంలేకుండా చెయ్యడానికి పూనుకుంది. పూర్ణమ్మ ఎంత అణగిమణగివున్నా లాభం లేక పోయింది. రెండు కత్తులు ఒక ఒరలో ఇమడవు.

ఫలితంగా రామయ్య ఒక రోజున రమణమ్మ మాటలు విని పూర్ణమ్మను తన్ని ఇంట్లోంచి తరిమేశాడు. రమణమ్మ, రామయ్య ఆమెమీద లేని పోని నిందలన్నీ మోపారు.

పూర్ణమ్మ పుట్టినింటికి తిరిగొచ్చింది. కష్టమో, నిష్ఠురమో అక్కడే కాలం గడపసాగింది. కాని, రమణమ్మ రామయ్యల ప్రచారం మూలంగా గ్రామంలో తన ప్రవర్తనమీద చెలరేగిన పుకార్లు ఆమె మనసును చలింపజేశాయి. నాటినించీ తనలో తనే ఏదో మాట్లాడు కోడం, పనీపాటా లేకుండా దిక్కు తోచనిదానిలా రోడ్లమీద అటూ ఇటూ తిరగడం ప్రారంభించింది. ఆమె గుండెల్లో రగులుతున్న అగ్నిపర్వ తాలను గురించి ఎవరికి తెలుసు పాపం!

అందుకే అంతా ఆమె పిచ్చిదై పోయిందన్నారు. అయాచితంగా ఆమెకు పిచ్చి పూర్ణమ్మ అని పట్టం కట్టారు.

చలమయ్య భార్య గతించాక ఒంటరిగా ఆ ఊరు వచ్చాడు. ఆ దేవాలయంలో పూజారిగా నియుక్త డయ్యాడు. ఆలయం ఆవరణలోనే ఒక చిన్నగదిలో ఉంటున్నాడు. పూజా పునస్కారాలు, వేదాంత పఠనం ఆయన దినసరి కృత్యాలు. అప్పుడప్పుడూ గ్రామస్థులకి పురాణం వినిపిస్తుంటాడు కూడా.

పూజారి చలమయ్యకు పూర్ణమ్మ గత గాథంతా తెలియదు. ఆమె పిచ్చి దనే లోకోపవాదాన్ని అతను నమ్మాడు. తనతో 'మామ' వరస కలుపుకు మాట్లాడే ఆ పిచ్చిదాని తీరు అంతే అనుకున్నాడు. కొన్నాళ్లుగా రోజూ ప్రసాదానికొస్తున్న పూర్ణమ్మ మనసులో ఉన్నది భక్తా మరేదైనానా చలమయ్యకు అంతుపట్టలేదు.

ఆ రాత్రి మామూలుగా గుళ్లో పూజా పునస్కారాలు ముగించి తన గదిలోకి వెళ్లి దీపం వెలిగించిన చలమయ్యకు మరునాడు వినాయక చవితి అన్న విషయం జ్ఞాపకం వచ్చింది. అతని భార్య రెండేళ్ల క్రితం వినాయక చవితి ముందురోజే గతించింది. అతని మనస్సంతా భార్యతో తాను గడిపిన జీవితపు స్మృతులతో నిండిపోయింది. దీర్ఘంగా నిట్టూర్చి బయటికి వచ్చాడతను.

సన్నని నెలవంక ఆకాశంలో మెరు స్తోంది. దేవాలయం ఆవరణలోని చెట్ల మీదినించి చల్లనిగాలి నలుదిక్కులా వ్యాపిస్తోంది వెళ్లి, ఆ చెట్ల మధ్యగా ఉన్న ఒక సిమెంట్ బెంచీమీద కూర్చు

డు చలమయ్య. గత జ్ఞాపకాలను రువేసుకోసాగాడు నెమ్మదిగా.

మసక వెన్నెల చెట్ల సందుల్లోంచి మిదికి తోసుకువస్తోంది. ఆ వెలుగులో ఆకారం కొంచెం దూరంలో ఒక దగ్గర నిలబడి ఉండడం చలమయ్య నించాడు అది వెలగచెట్టు. వెలగ పలు కొమ్మలనించి వేలాడు న్నాయి

"ఎవరక్కడ?" చలమయ్య ముందు గేస్తూ అడిగాడు.

"నేనే చలమయ్య మావా!" అవతలి ని ఆడకంఠం వినిపించింది.

ఆ మనిషెవరో చలమయ్య ల్చుకోగలిగాడు. కాని, ఈ సమ ంలో ఆమె అక్కడేం చేస్తుందో ని కర్థంకాలేదు. అతనామె దగ్గరికి న్నాడు అప్పుడే కోసిన రెండు ంకాయలు ఆమె చేతిలో కనిపిం యి

ఆమె ముఖంకేసి చూశాడు ంమయ్య ఆమె ముఖంలోని ఆకర్షణ ంకా తొలగిపోలేదు. శరీర సంస్కా ంలో లోపం వున్నా, ధరించిన దుస్తులు -నంగా వున్నా వయసులోని పొంగు ంకా ఆమెలో చల్లారలేదు. అతని నసు చలించినట్టయింది. గుండె బిగుబలాడింది.

ఒంటరిగా తన ఎదుట ఒక ఆడది - ందీ చల్లని వెన్నెల రాత్రిలో! చలమయ్య చెయ్యి అప్రయత్నంగా ఆమె చేతిని పట్టుకుంది. "పూర్ణమ్మా!" అన్న పిలుపు మత్తుగా అతని నోట్లోంచి బయటికి వచ్చింది.

"ఏమిటి చలమయ్య మావో - నాతో సరసాలాడుతున్నావ్?" అంది పూర్ణమ్మ నవ్వుతూ తనచేతిని విడిపించు కుని.

ఆ నవ్వు అతన్ని పూర్తిగా వివశుణ్ణి చేసింది.

"అలా - నా గదిలోకి - వెళ్దాం వస్తావా?" అన్నాడు చలమయ్య తడబడుతూ.

"ఎందుకూ" ప్రశ్నించింది పూర్ణమ్మ. చలమయ్య ఆమె కళ్లల్లోకి అయో మయంగా చూశాడు.

"ఇదేనా చలమయ్య మావా, నువ్వు నేర్చుకున్న వేదాంతం! మంచి వేదాంతమేలే!" అని నవ్వి, "చలమయ్య మావో! నన్ను ఈ జన్మలో పొందే అర్హత ఒక్కడికే ఉంది. నేను చచ్చినా వాడి చేతిలోనే చావాలి. మరొక రెవరికీ నన్ను ముట్టుకునే హక్కు లేదు," అంది గంభీరంగా బొంగురు పోయిన కంఠంతో పూర్ణమ్మ.

ఆమె కళ్ళలో నీళ్లు తిరగడం చలమయ్య గమనించాడు ఆ మసక వెలుగులో. అతని తల తిరిగినట్టయింది. ఎంతలో తనెంత నీచానికి దిగజార బోయాడు! నిజానికి తాను అధఃపాతాళం




లోకి దిగకుండా పిచ్చి పూర్ణమ్మ కాపాడింది. అదే మరో స్త్రీ అయితే, తన గతి ఏమయ్యేదో!

పిచ్చి పూర్ణమ్మ తన పట్ల అన్నపూర్ణమ్మ!

"క్షమించు పూర్ణమ్మా!" అన్నాడు తడారిపోయిన గొంతుతో చలమయ్య.

"అదేవిటిలే చలమయ్య మావా! ఇంతలోనే నన్ను నువ్వు ఎగేసుకు పోలేదుగా! - రేపు వినాయకుడి పూజకని పసికూనకి రెండు వెలక్కాయలు కోసు కెళ్దానికొచ్చా. వస్తా," అంటూ విసవిసా నడిచి వెళ్ళిపోయింది పూర్ణమ్మ ఏమీ జరగనట్టుగా.

అటే చూస్తూ నిశ్చలంగా నిలబడి పోయాడు చలమయ్య

అతని మస్తిష్కంలో ఏవేవో సందేహాలుద్భవించాయి

ఎవరా పసికూన?

ఆమెను భర్త వదిలేశాడు కదా?

మరి పూర్ణమ్మకి పిల్లలెక్కడున్నారు?

కాని, తన సందేహాలకు సమాధానాలు తెల్సుకోడానికి చలమయ్య ప్రయత్నించ లేదు పూర్ణమ్మపట్ల మనసులో ఏర్పడిన పవిత్ర భావాన్ని మననంచేసుకుంటూ తన గదివైపు నడిచాడు

* * *

చంటిబాబు రామయ్య సంతానం రమణమ్మకు కలిగిన ఒక్కగా నొక్క కొడుకు ఆ తర్వాత వాళ్లకే సంతానమూలేదు వాడి కిప్పుడు ఐదారేళ్లుంటాయి

వాడంటే పూర్ణమ్మకు ఎంతో ప్రేమ వాడిపట్ల ఆమెకున్న అనురాగ వాత్సల్యాలను కొలవడానికి సాధనాలు లేవు

రోజూ ఉదయం పనిగట్టుకుని గుడికొచ్చి వాడికోసమని కొబ్బరి ప్రసాదం తీసుకెళ్తుంది ఏరోజైనా వాడా గుడి ప్రాంతానికి రాకపోతే ఆమె మనసు విలవిల్లాడిపోతుంది వాడికోసం ఆత్రంగా వెదుకుతుంది వాణ్ణి చూసే వరకు ఆమె గుండెల్లోని ఆరాటం తగ్గదు

ఆ సాయంత్రం గుడివేపు ఆడుకోడానికొచ్చి చీకటిపడ్డాక ఇంటికి వెళ్ళబోతున్న చంటిబాబుని ఆపింది పూర్ణమ్మ

"ఉండు బాబూ - రెండు వెలక్కాయలు కోసుకొచ్చిస్తా రేపు వినాయకుడి పూజ కమ్మా, బాగా చేసుకోవాలి బాగా చదువుకోవాలి నువ్వు," అంది

పూర్ణమ్మ వెలక్కాయలు కోసుకొచ్చే సరికి గోడమూల చీకట్లో నిలబడి ఉన్నాడు చంటిబాబు

"నేనంటే నీకెంత ఇష్టం పిచ్చమ్మా!" అన్నాడు వాడు ఆ కాయలు తీసుకుని లాగుజేబులో వేసుకుంటూ

"ఔను బాబూ," అందామె ఆప్యాయంగా

"నువ్వు నా కేమవుతావ్?" వాడు సందేహంగా అడిగాడు

"ఏమీ కాను!" ఆమె కళ్ళు తుడుచుకుంది

"నువ్వు మా యింటికి రాకూడదూ! మా అమ్మతో చెప్పి తాయంపెట్టిస్తాను," అమాయకంగా అన్నాడు వాడు

"రావల్సిన రోజొస్తాలే బాబూ - అసలు నా తాయం అక్కడే ఉందిగా," అని నవ్వుతెచ్చిపెట్టుకుంటూ, "ఆ, ఇక నువ్వెళ్లు బాగా చీకటిపడిపోయింది," అంది పూర్ణమ్మ

వెనక్కి తిరిగిన చంటిబాబు ఒక్కసారిగా కెవ్వుమన్నాడు "బాబూ," అని ఆమె ఆత్రంగా వారిని పట్టుకుంది.

"అమ్మా!" అని బాధగా అరచి వాడామె చేతుల్లోకి ఒరిగిపోయాడు

పూర్ణమ్మ వాడిని భుజాన వేసుకుని కంగారుగా గుళ్ళోకి పరుగెత్తింది

"చలమయ్యమావా! చలమయ్య మావా!" అంటూ కేకలు పెట్టింది

చలమయ్య గబగబా గదిలోంచి బయటికి వచ్చాడు

"బిడ్డ చీకట్లో కెవ్వుమని అరిచి పడిపోయాడు ఏం కుట్టిందో ఏమో! నువ్వే కాపాడాలి చలమయ్య మావా!" అని గొల్లుమంది పూర్ణమ్మ

చలమయ్య ఇంట్లోంచి దీపం తెచ్చి పిల్లవాడ్ని చూశాడు

కాలిమీద చెమర్చిన రక్తాన్ని చూశాడు

"మరేం లేదూ తేలు కుట్టింది కంగారుపడకు పూర్ణమ్మా!" అని చలమయ్య దగ్గర్లో ఉన్న వేపచెట్టు దగ్గరికి వెళ్ళాడు

తేలుమంత్రంలో నిపుణుడని చలమయ్యకు పేరు ఎవరికి తేలు కుట్టినా, పాము కరచినా గ్రామస్థులంతా ఆయన దగ్గరి కొస్తారు

చలమయ్య వేపమండ విరుచుకొచ్చి మంత్రం పెట్టాడు విభూతి మంత్రించి బిడ్డనొసట పెట్టాడు తేలు కుట్టిన చోటికి పైన గుడ్డతో గట్టిగా కట్టాడు

"అమ్మా," అని బాధగా మూలిగాడు చంటిబాబు కళ్ళు తెరచి

"బాబూ," అంది ఆప్యాయంగా పూర్ణమ్మ

కళ్ళనీళ్ళు తుడుచుకుని, "చలమయ్య మావా, ఇందాక ఏవేవో వాగాను. ఏమనుకోకు పిచ్చిదాన్ని మన్నించు. నా పసికూనని కాపాడావు నీ మేలు ఈ జన్మలో మరవలేను —" అని ఇంకా ఏమో అనబోయింది పూర్ణమ్మ

"పూర్ణమ్మా! నా మంత్రంలో ఇంకా శక్తి మిగిలిఉందంటే అది నీవల్లనే. పాప పంకిలంలో దిగకుండా నన్ను కాపాడింది నువ్వు — ఇక నీ బిడ్డకేం ఫర్వాలేదు కాసేపట్లో తగ్గిపోతుంది. నువ్వెళ్ళు," అన్నాడు చలమయ్య

పూర్ణమ్మ మూలుగుతున్న బిడ్డను తీసుకొని గుళ్ళోంచి తిన్నగా రామయ్య ఇంటివేపు సాగిపోయింది

బిడ్డని ఆ స్థితిలోచూసిన రామయ్య, రమణమ్మ కంగారుపడిపోయారు పిచ్చిపూర్ణమ్మ గుడ్లనీరు కుక్కుకు టోంది ఉన్నట్టుండి రమణమ్మ విరుచుకుపడింది

"అంతా ఈ ముదనష్టపుదానివల్లే జరిగింది నా మీద కోపంతో నా బిడ్డని చంపాలని చూస్తోంది అయ్యో అయ్యో," అని అరవసాగింది

పూర్ణమ్మనోట మాటలు రాలేదు కాదు కాదన్నట్టు సైగచేస్తూ ఉండి పోయింది

రమణమ్మ మాటలు విన్న రామయ్య

ఆవేశంలో కర్ర తెచ్చి పూర్ణమ్మను గొడ్డును బాదినట్టు బాదాడు "నా బిడ్డను చంపుదామనుకుంటున్నావా ? ఈసారి నా బిడ్డజోలికొస్తే ప్రాణం తీస్తాను, జాగ్రత్త," అని కోపంతో హుూంకరించాడు

అన్నిటికీ కళ్లనీ కన్నీళ్లనీ అప్పగించింది పూర్ణమ్మ కోతపడిన మనసుతో గాయపడిన ఒంటితో నడవలేక నడవలేక అక్కడినించి కుంటుకుంటూ వెళ్లిపోయింది చుట్టూ చేరినవాళ్లంతా జరిగిందాన్ని వినోదంగా చూశారు

కాని, మరునాటి సాయంకాలం మామూలుగా ఆడుకుంటున్న చంటిబాబుని చూసేవరకు ఆమె మనసు మనసులో లేదు

"పిచ్చమ్మా! నువ్విచ్చిన వెలక్కాయల్తో వినాయకుడి పూజ బాగా చేశాను," అంటూ వాడు ఆమెదగ్గరికి రాబోయాడు

కాని, ఆమె ముఖం చాటుచేసుకుని మారుమాట్లాడకుండా ప్రక్కసందులోకి వెళ్లిపోయింది పిల్లవాడు బిక్కమొహం వేశాడు, కారణం తెలియక

అలా కొన్నాళ్లు గడిచిపోయాయి

పూర్ణమ్మ రోజూ దూరంనించే పిల్లవాణ్ని చూసి సంతృప్తిపడి వెళ్లిపోతోంది తనతో మాట్లాడని పిచ్చమ్మతో తనకేం పనిలే అని కోపంకొద్దీ ఆమె వైపే చూడ్డం మానేశాడు చంటిబాబు

అంతలో దీపావళి పండగ వచ్చింది అది ప్రత్యేకం పిల్లల పండుగ. వారం రోజులుగా చేర్చిపెట్టుకుంటున్న టపాకాయల్ని, మందుగుండునీ కాల్చుకుని ఆనందించే అవకాశం వాళ్లకప్పుడే కలుగుతుంది

నరక చతుర్దశి రోజు పిల్లలంతా టపాకాయలు కాల్చారు మందుగుండు సామాను పేల్చారు గోగూచలతో మంటలు వేశారు నిప్పు రవ్వల్ని వెదజల్లే పూలపొట్లాల్ని గిరగిరా తిప్పారు పెద్ద పెద్ద మంటలు వేసి శక్తికొద్దీ వాటిమీదుగా దూకారు

ఆ సందకాడ పూర్ణమ్మ కాలుకాలిన పిల్లిలా రోడ్లంతటా తిరుగుతూనే ఉంది తానప్పుడప్పుడు చేర్చిపెట్టిన రూపాయి డబ్బుల్తో టపాకాయలు కొని, వాటిని చంటిబాబు కివ్వాలని రెండు రోజులుగా ప్రయత్నిస్తోంది కాని, వాడు కనిపించలేదు ఈ రోజూ కనిపించకపోతే తన శ్రమంతా బూడిదలో పన్నీరే

నరకచతుర్దశిరోజు రాత్రి గుడి ముందు వేసిన పెద్దమంట దగ్గర మిగిలిన పిల్లల్తోపాటు చంటిబాబు కనిపించాడు చివరికి పూర్ణమ్మ ధైర్యంగా వాడిని దగ్గరికి తీసుకుని తన దగ్గరున్న టపాకాయలు వాడి కిచ్చింది

"ఎందుకని పిచ్చమ్మా, ఇన్నాళ్లూ నాతో మాట్లాడలేదు," అన్నాడు వాడు అమాయకంగా ముఖంపెట్టి

"ఏంలేదు బాబూ, ఏం లేదు," అందామె గాద్గదికంగా.

"రేపు నువ్వు తప్పకుండా మా యింటికి రావాలి. నీకు బోలెడన్ని అరిశెలు, బూరెలు, గారెలు పెడతా," అన్నాడు వాడు.

"అలాగే, తప్పకుండా వస్తాలే బాబూ! టపాకాయలు జాగ్రత్తగా కాల్చుకో," అని అక్కడినించి వెళ్ళిపోయింది పూర్ణమ్మ.

దీపావళి ఉత్సాహంగా గడిచిపోతోంది. అరుగులమీద వరుసలు దీరి ప్రమిదలు వెలుగుతున్నాయి. ఇళ్ళముందే వేళ్లాడుతున్న తాటాకు గుమ్మటాల్లోని దీపాలు కాంతుల్ని విరజిమ్ముతున్నాయి. ఊరంతా సందడిగా వుంది. పిల్లలంతా దివిటీలతో ఊరిచివర మైదానంలోని జమ్మిచెట్టును చుట్టివచ్చారు.

క్రమంగా అందరి ఇళ్ళలోను భోజనాలు ముగిసేసరికి బాగా పొద్దుపోయింది. పండగ పనులతో, ఆట పాటలతో అలసిన పెద్దలూ పిన్నలూ అంతా నిద్రల కుపక్రమించారు. అర్ధరాత్రయ్యేసరికి ఊరంతా మాటుమణిగింది. అడపాదడపా ఎక్కడో టపాకాయలు పేలిన శబ్దం వినిపిస్తోంది. అక్కడక్కడా నూనెదీపా లింకా మిణుకుమిణుకు మంటున్నాయి.

కాని, పూర్ణమ్మ ఇంకా నిద్రపోలేదు. తానిచ్చిన టపాక్కాయల్ని ఆనందంగా కాల్చుకుంటున్న చంటిబాబుని చాటుగా చూసినప్పుడు ఆమె గుండెల్లో వెలిగిన దీపం ఇంకా వెలుగుతూనే ఉంది.

అంతలో ఎక్కడినుంచో హాహాకారాలు ఒక్కసారిగా వినిపించాయి. గభాల్న లేచి అటువైపు పరుగెత్తిందామె.

రామయ్య ఇల్లు తగలబడిపోతోంది. మంటలింకా పైపైకి విజృంభిస్తున్నాయి. అప్పటికే అక్కడ చేరిన వాళ్ళంతా మంటలార్పడానికి ప్రయత్నిస్తున్నారు.

"అయ్యో, నా బిడ్డ నా బిడ్డ, లోపల మంటల్లో ఉండిపోయాడు. కాపాడండి బాబోయ్," అని లబోదిబోమంటోంది రమణమ్మ.

మంటలార్పడానికి పూనుకున్న రామయ్య సైతం బిడ్డని మంటల్లోంచి బయటికి తేడానికి సాహసించలేకపోయాడు.

అప్పుడే అక్కడికి పరుగు పరుగున వచ్చిన పూర్ణమ్మని మంటల వెలుగులో చూడగానే, "నా బిడ్డ శవాన్ని కళ్ల చూడ్డానికి మహాకాళి వచ్చిందర్రో," అని రాగాలు తియ్యసాగింది రమణమ్మ.

పూర్ణమ్మకి అంతా అర్థమైంది. మనసు బండబారిపోయింది. మరుక్షణంలో తానేం చేసిందో తనకే తెలియదు.

క్రమంగా మంటలు సన్నగిలిపోయాయి. ఆశ వదులుకున్నా, ఇక బిడ్డకోసం లోపలికెళ్దామనుకున్న

రామయ్య ఎదటి దృశ్యాన్ని చూసి స్తంభించిపోయాడు.

ఎదురుగా పూర్ణమ్మ చంటిబాబుని గుండెకదుముకుని నిలబడి ఉంది. ఆమె జుట్టు పూర్తిగా కాలిపోయింది. చీరకూడా చాలావరకు తగలబడి పోయింది. ఒళ్లూ, మొఖం కాలి బొబ్బ లెక్కాయి. తిన్నగా వచ్చి రామయ్య కాళ్లదగ్గర కుప్పలా కూలిపోయింది.

రమణమ్మ పరుగున వచ్చి బిడ్డనందు కుంది. ఒళ్లంతా తడిమి చూసింది. ఎక్కడా పెద్దగా గాయాలు లేవు.

"అమ్మా, పిచ్చమ్మా!" అన్నాడు మగతగా కళ్లు తెరిచి చంటిబాబు. వాడి కళ్లు పిచ్చమ్మకోసం వెదకసాగాయి. చుట్టూ చేరినవాళ్లంతా అవాక్కయి అక్కడి దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు.

తనూ కింద చతికిలబడి పూర్ణమ్మ తలను ఒళ్ళోకి తీసుకున్నాడు రామయ్య. అతని కళ్లలో నీళ్ళు నిండాయి. గొంతు తడారిపోయినట్టయింది. చివరి కెలాగో, "పూర్ణమ్మా!" అన్నాడు బొంగురు పోయిన గొంతుతో.

పూర్ణమ్మ నెమ్మదిగా కళ్లు తెరిచి చూసింది.

"పూర్ణమ్మా! మే మెవరం చెయ్య లేని సాహసం చేసి బాబుని కాపాడావ్" ఆపైన మాట్లాడలేకపోయాడు రామయ్య.

"అలా అనకు. వాడు మన వంశో ద్ధారకుడు. వాడే నా సర్వస్వం. ఇవ్వాళ నన్ను ఇంటికి రమ్మని పిల్చాడు వాడు. వస్తానన్నాను — వచ్చాను," అంది హీన స్వరంలో పూర్ణమ్మ.

"పూర్ణమ్మా!" బాధగా అన్నాడు రామయ్య.

"వాడికోసం వచ్చాను. కాని, నీ చేతుల్లో ప్రాణాలొదిలే భాగ్యం కలిగింది. చస్తే - నీ చేతుల్లోనే చావాలని ఎప్పుడో అనుకున్నాను. నా కోరిక తీరింది," అంది ఒగరుస్తూ పూర్ణమ్మ.

"పూర్ణమ్మా! నీకు నేను చాలా ద్రోహం చేశాను," అన్నాడు గుండెల్ని బిగబట్టుకుని రామయ్య.

"ఫర్వాలేదు. నేనంతా భరించాను. కాని, నా దొక్కటే కోరిక. నేను కులటని కాదని నువ్వు నమ్మితే చాలు, నీ చేతుల్లో సంతోషంగా ప్రాణాలొదు ల్తాను," అంది పూర్ణమ్మ.

"నిన్ను నమ్ముతున్నాను పూర్ణమ్మా! నన్ను నమ్ము," అన్నాడు రామయ్య కన్నీళ్ళతో.

పూర్ణమ్మ తల ప్రక్కకు వాలి పోయింది. ఆమె సంతృప్తిగా అంతిమ శ్వాస విడిచింది.

"పూర్ణమ్మా!" గావుకేక పెట్టాడు రామయ్య.

"పిచ్చమ్మా!" దీనంగా పిల్చాడు చంటిబాబు.

"పిచ్చి ప్రేమ!" అనుకున్నారు చుట్టూ చేరినవాళ్లు.